
ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



రోగమొస్తే.. రోదనే!

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ అధ్వానం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పాలకులు మారుతున్నా.. సర్కారు ఆస్పత్రుల్లో సమస్యలు మాత్రం తీరటం లేదు. వైద్యరంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రి(ఎంజీఎం)లో వైద్య సేవలు మెరుగు పడటం లేదు. పలు ఆరోగ్య సమస్యలతో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వచ్చే రోగులకు ఆస్పత్రిలో అగచాట్లే ఎదువుతున్నాయి. ఉచిత మందులు, వైద్య పరీక్షలన్నీ ఉత్తమాటలుగా మిగులుతున్నాయి. టెస్టులకు కిట్లుండవు.. ఫార్మసీల్లో మందులుండవు. సూది మందు నుంచి సెలైన్ వరకు అన్నీ బయట కొనాల్సిందే. రాత్రివేళ జన్మించే పిల్లలకు ఎక్స్‌రేలు తీసేందుకు ఆపరేటర్లు అదుబాటులో ఉండరు. కార్డియలాజీ, న్యూరో, డెంటల్, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో పూర్తిస్థాయిలో వైద్యులు కరువు. గత ప్రభుత్వమే పేదల దవాఖానాను గాలికి వదిలేసిందని భావిస్తున్న ప్రజలకు కాంగ్రెస్ సర్కారు కూడా అదేబాటలో నడుస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రక్త పరీక్షలకు కిట్ల కొరత

ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్న వరంగల్‌లోని ఎంజీఎంకు ఉమ్మడి వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల నుంచి వైద్య పరీక్షల కోసం ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో నిత్యం సుమారు నాలుగైదు వేల మందికి పైగా ఓపీ, ఐపీ సేవలు పొందుతున్నారు. ఎంజీఎం ఆస్పత్రితో పాటు అనుబంధంగా ఏర్పాటు చేసిన కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని 21 విభాగాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే తాజాగా వరంగల్ ఎంజీఎంలో రక్త పరీక్షలకు కొరతొచ్చింది. ఎన్నడూ లేని విధంగా గురువారం ఎంజీఎం ల్యాబ్‌లో బ్లడ్ కంటైనర్స్ లేవని రక్త పరీక్షలు నిర్వహించకపోవడంతో రోగులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు పెట్టాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఏ వైద్యం చేయాలన్నా మొదటి బ్లడ్ టెస్ట్ చేయాలని వైద్యులు సూచిస్తారు. అలాంటి బ్లడ్ టెస్టులు ఎంజీఎంలో కరువవ్వటంతో రోగుల బాధలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. అలాగే థైరాయిడ్, షుగర్, హెచ్ఐవీ, క్యాన్సర్ తదితర వాటి కోసం బయో కెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ టెస్టులు చేసేందుకు ల్యాబరేటరీల్లో కెమికల్స్ ఎప్పుడు అందుబాటులో ఉంటాయో.. ఎప్పుడు ఉండవో ఆ దేవుడికే తెలియాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అత్యవసర పరీక్షల కోసం వచ్చే రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. గుండె జబ్బులకు సంబంధించి నిర్వహించే టూడీ ఎకో పరీక్షలు కూడా భారంగా మారాయి. ఒక్కో సారి టెక్నీషియన్లు లేరని రోగులును ప్రవేటు ఆస్పత్రులకు పంపించిన సందర్భాలున్నాయి. ఇన్ఫ్రాస్ట్రక్చర్ పాడైపోతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. గ్యాస్ట్రో డిపార్ట్‌మెంట్‌లో కొలనోస్కోపీ, ఎండో స్కోపీ యంత్రాలు పాడై పనికి రాకుండా పోవటంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. ఇక రాత్రిపూట డెలవరీ అయిన తరువాత అప్పుడే పుట్టిన బిడ్డలో కొన్ని సమస్యలు ఉత్పన్నమవ్వటం సాధారణమే. అయితే బిడ్డలో ఏ సమస్య ఉందో తెలుసుకునేందుకు అప్పుడప్పుడు వైద్యులు ఎక్స్‌రే, స్కానింగ్‌కు రిఫర్ చేస్తారు. కానీ రాత్రిపూట ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాల్లో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం బాధితులకు నరకయాతనగా మారతోంది. దాంతో తెల్లవారుజామున సిబ్బంది వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. బిడ్డ సమస్య తీవ్రంగా ఉంటే అర్ధరాత్రి వేళ ప్రైవేటు ఎక్స్‌రేలు, స్కానింగ్ సెంటర్లకు వెళ్లి డబ్బులు చెల్లించి చేయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎంలో తరుచుగా డయాగ్నస్టిక్ సెంటర్‌లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈసీజీ విభాగంలో తగిన సంఖ్యలో మహిళ సిబ్బంది లేకపోవటంతో ఈసీజీలను తీయడానికి సమస్యలు ఎదురవుతున్నాయి. టెక్నీషియన్ల కొరతతో కిడ్నీవ్యాధిగ్రస్థులు డయాలసీస్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని వాపోతున్నారు. తరచూ కంప్లీట్ బ్లడ్ కౌంట్(సీబీసీ) మెషిన్ మరమ్మతులకు గురవుతుండటంతో బాధితులను ప్రైవేట్‌కు రిఫర్ చేస్తున్న సంఘటనలు ఇటీవలకాలంలో వెలుగు చూస్తున్నాయి.



- తీరు మారకపోవడంతో ప్రజల ఇబ్బందులు
- ఫార్మసీలో మందుల కొరత
- పెయిన్ కిల్లర్, విటమిన్ టాబ్లెట్లూ కరువే..
- కిట్లు, కెమికల్స్ లేక పలు నిర్ధారణ పరీక్షలకు బ్రేక్
- బ్లడ్ కంటెయినర్స్ లేవంటూ టెస్టులు చేయని సిబ్బంది
- రాత్రివేళ ఆపరేటర్లు లేక నిలిచిపోతున్న ఎక్స్‌రే, స్కానింగ్
- కిడ్నీవ్యాధిగ్రస్థులకు తప్పని డయాలసిస్ కష్టాలు
- పేద బతుకులకు పరీక్ష పెడుతున్న సర్కారు దవాఖానా
- ఎంజీఎం సమస్యలపై దృష్టిపెట్టని మంత్రులు, ఎమ్మెల్యేలు





మందు గోళీలు కరువాయే..

ఎంజీఎం ఆస్పత్రిలో మందు గోళీల కొరత కొనసాగుతూనే ఉంది. కొన్నాళ్లుగా ఎంజీఎం ఫార్మసీలో సరిపడా మందులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఉండే పీహెచ్‌సీల్లో లభ్యమయ్యే విటమిన్, పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు కూడా ఎంజీఎం ఫార్మసిలో లభ్యం కావటం లేదు. ఆస్పత్రిలో వివిధ సర్జరీల తరువాత నొప్పి బాధ తెలియకుండా ఉండేందుకు వైద్యులు పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు వాడమంటారు. అయితే ఫార్మసిల్లో ఈ టాబ్లెట్ల కృత్రిమ కొరతను సృష్టించి ప్రైవేటు మెడికల్ షాపులకు గిరాకీ పెరిగేలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనలో రోగుల నుంచి ఫిర్యాదులు రావటంతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఫార్మసిని తనిఖీ చేసి, వాస్తవాలను నివేదిక రూపంలో ఇవ్వమని మంత్రి కోరారు. దీంతో డాక్టర్ కడియం కావ్య ఎంజీఎం ఫార్మసీని పరిశీలించి అవాక్కయ్యారు. పీహెచ్‌సీల్లో లభించే మందులు కూడా ఎంజీఎంలో అందుబాటులో లేకపోవటం పట్ల ఎంపీ విస్మయం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి ఎంపీ నివేదికను అందిచినట్టు సమాచారం. కాగా, ఎంజీఎంలో సుమారు 200రకాలకు పైగా మందులు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే కొన్ని సాధారణ రకాల మందులు మాత్రమే ఎంజీఎం ఔషధ షాపుల్లో ఇస్తున్నారు. మిగతా మందుల కోసం బయట ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు మందులకే ఖర్చు అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇంతా పెద్దాస్పత్రిలో మందు గోలీ కూడా కరువైందని రోగులు గగ్గోలు పెడుతున్నారు.

పేదల దవాఖానాపై సర్కారు నిర్లక్ష్యమేల?

బీఆర్ఎస్ హయాంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్లక్ష్యానికి గురైందనే ఆరోపణలున్నాయి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా పేదల ఆస్పత్రిలో మెరుగైన సేవలపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోనే ఎంజీఎం ఉన్నా ప్రభుత్వ పట్టింపులేదని, ఈ పది నెలల కాలంలో ఒక్కసారి కూడా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి ఎంజీఎం ఎదురుగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేసినా పేదల ఆస్పత్రిలో సౌకర్యాలను పరిశీలించేందుకు ఎంజీఎంలోకి రాలేదనే విమర్శలున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రెండు సార్లు వరంగల్ పర్యటనకు వచ్చినా ఎంజీఎం ఆస్పత్రిలో సమస్యలపై సమీక్షించలేదని ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇక ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరంలో ఉన్న అన్ని సమస్యలపై సమీక్షిస్తున్నప్పటికి ఎంజీఎంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని, పేదల పక్షాన గళం వినిపించే మంత్రి సీతక్క కూడా ఎంజీఎంలో పేదలకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించేందుకు కలగచేసుకోవటం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎంజీఎంలో సమస్యలను పరిష్కరించకుండా దాటవేసే ప్రయత్నాలు చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడప్పుడు ఎంజీఎం అస్పత్రి సమస్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మినహా మిగతా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ అస్పత్రి సేవలు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించటం లేదనే చర్చ జరుగుతోంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ చూపి ఎంజీఎంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయటంతో పాటు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందేలా దృష్టిపెట్టి అభివృద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి భవన ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, చిత్రంలో మానుకోట ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు

ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వరంగల్‌లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, క్యాన్సర్ ట్రీట్మెంట్ సెంటర్ ఏర్పాటు
- నర్సంపేటలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మంత్రులు పొంగులేటి, సురేఖతో కలిసి వైద్యకళాశాల, ఆస్పత్రి ప్రారంభం

7 లో..



మెడికల్ కళాశాల, ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

పసిడి మంట

- తులం రూ.74,450
- వెండి కిలో రూ.90వేలు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 19: పెళ్లిళ్ల సీజన్ ఇంకా ప్రారంభం కాకముందే వారం రోజుల నుంచి పసిడి ధర పెరుగుతూ వస్తోంది. గురువారం బంగా రం తులం(బిస్కెట్) ఏకంగా రూ.74,450, నవరస్ బంగారం తులం రూ.68,540 ధర పలికింది. వారం రోజుల కింద తులం బంగారం రూ.71,500 ఉండగా, అది రూ.74,450కు చేరింది. కార్తీక, మార్గశిర మాసం నవంబరు నుంచి జనవరి వరకు వివాహ శుభకార్యాలు ఉండటంతో ముందస్తుగా రెండు నెలల ముం దుగానే నగలను ఆర్డర్ ఇచ్చి బంగారం కొనుగోలు చేస్తారు. దీంతో బంగారం గిరాకీ ప్రారంభమవుతుంది. మరో పదిహేను రోజుల్లో రూ.80వేలకు చేరుకోవచ్చని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే వెండి కిలో రూ.74వేల నుంచి ధర పెరుగుతూ గురువారం నాటికి రూ.90వేలకు చేరింది. పెళ్లిళ్ల సీజన్‌కు మరో రెండు నెలల ముందే బంగారు, వెండి ధరలు చుక్కలు అంటున్నాయి. దీపావళి వరకు బంగారం రూ.80 వేలకు చేరుకోనుంది.



బల్దియాలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలోని పలు సెక్షన్‌లలో బల్దియా కమిషనర్ అశ్విని తానా జీ వాకడే గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పలు సెక్షన్‌లలో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి సిబ్బంది వివరాలు తెలుసుకుని రిజిస్టర్‌లను పరిశీలించారు. సిబ్బంది ఎన్నిగంటలకు కార్యాలయాలకు వస్తున్నారు? ఏం పని చేస్తున్నారు? జాబ్‌చార్ట్‌పై అక్కడ పని చేసే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమాచారం ఇవ్వకుండా విధుల కు గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజు నోటీజులు, విధులకు డుమ్మా కొట్టే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒక రోజు వేతనం కోత పెట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ విజయ లక్ష్మి, సీ-1 సూపరిటెండెంట్ చీకటి ఆనంద్ పాల్గొన్నారు.




బల్దియాలో అకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్

మార్కెట్లో పడిపోతున్న మక్కల ధర

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 19: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మొక్క జొన్నల ధరలు రోజురోజుకూ పడిపోతు న్నాయి. పది రోజు క్రితం క్వింటా రూ.3,070 పలికింది. దీంతో పంటకు గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు సంతోషపడ్డారు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ధర రోజురోజుకూ పడిపోతూ వస్తోంది. గురువారం క్వింటాకు కేవలం రూ.2,665 పలకడంతో రైతులు డీలా పడ్డారు. అదేమిటని అడిగితే కొత్త మక్కలలో తేమ ఎక్కువగా ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. దాంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి గిట్టుబాటు ధరలకు పాటుపడాలని కోరారు.



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో అరబోసుకున్న మక్కలు



బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు


ఐనవోలు, సెప్టెంబరు 19: బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన అలాకుంట మధు అనే యువకుడు అత్యాచారం చేశాడు. బాధితురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.
























ఇక ఏడాదిలో రెండు దఫాలుగా

పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూలో కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా నోటిఫికేషన్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీలో ఇకపై ఏడాదిలో రెండు దఫాలుగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సెప్టెంబరు 14న ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ముందే ఆయా మార్గదర్శకాలను, వివరాలను వెల్లడిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన వర్సిటీ ఉన్నతాధికారులు.. నోటిఫికేషన్ వెలువరించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం న్యూఢిల్లీలోని యూజీసీ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ ఏడాది జనవరి, జూలై నెలల్లో 2024-25 నవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల నోటిఫికేషన్లు జారీ చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు అన్ని విభాగాల డీన్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విభాగాల వారిగా ఖాళీల మేరకు ప్రతీ ఏడాది రెండు దఫాలుగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఉత్తర్వులు విడుదల చేశారు. ఫెల్లోషిప్ అభ్యర్థులతో పాటు యూజీసీ నెట్, సీఎస్ఐఆర్, సీఈఈడీ, డీబీటీ, ఎఎఫ్‌పీడబ్ల్యూడీ, డీఎస్‌టీ, ఇన్‌స్పైయిర్ ఆఫ్ ఎఫ్ఐపీ, క్యూఐపీ, నెట్, గేట్, జీపీఏటీ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల స్కోరు ఆధారంగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ టీటీటీ.జ్బుజ్బుజీడ్బుచి.జీలో చూడాలని పేర్కొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్

పోటీల్లో వరంగల్ సత్తా

బ్రాంజ్ మెడల్ సాధించిన శ్రీ చేతన్ శౌర్య

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో ఈనెల 14 నుంచి 19 వరకు జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్స్ అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ జిల్లా బల్దియా ఇండోర్ స్టేడియం క్రీడాకారుడు శ్యామల శ్రీ చేతన్ శౌర్య ప్రతిభ కనబరిచాడు. జాతీయస్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు బల్దియా ఇండోర్ బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్‌రావు గురువారం వెల్లడించారు. శ్రీ చేతన్ శౌర్య ఇటీవల దేశవ్యాప్తంగా పలు చోట్ల జరిగిన ర్యాంకింగ్ టోర్నమెంట్‌లలో డబుల్స్‌లో ఇండియాలో 3వ ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారుడిని వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రమేష్‌రెడ్డి, బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావులతోపాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించిన శ్రీ చేతన్ శౌర్య

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక

కేయూ ఇంజనీరింగ్ స్టూడెంట్ సాత్విక ఎప్పీకి అరుదైన అవకాశం



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి లాదెళ్ల సాత్విక ఎప్పీకి అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3, 4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఫోరం 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఇన్ రీసెంట్ చాలెంజెస్ ఇన్ ఇంజనీరిగ్ అండ్ టెక్నాలజీ -2024' అనే అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానుంది. ఈ మేరకు సదస్సు సెక్రటరీ డాక్టర్ ఫ్రాంక్ హోవర్డ్ నుంచి లాదెళ్ల స్వాతిక ఎప్పీకి ఆహ్వానం అందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. సదస్సులో స్వాతిక ఎప్పీ 'అన్ ఇంప్రూవ్‌డ్ రాండమ్ ఫారెస్టు ఆల్‌గోరిథమ్ ఫర్ ఫెటల్ హెల్త్ క్లాసిఫికేషన్' అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైన స్వాతిక ఎప్పీని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

రైల్వే మూడోలైన్‌ను పరిశీలించిన సేఫ్టీ కమిషనర్

కాజీపేట, సెప్టెంబరు 19: కాజీపేటలో గురువారం రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రైల్వేట్రాక్‌లను పరిశీలించారు. ప్రత్యేక ట్రాలీలో ముందుగా కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు ట్రాక్‌ను పరిశీలించారు. కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగ మార్గంపై ఉన్న రైల్వే ట్రాక్‌ను పరిశీలించినట్లు తెలిసింది. సొరంగమార్గంతో పాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల శుక్రవారం సైతం కొనసాగనున్నాయి. త్వరలో ఈ ట్రక్‌ల ద్వారా రైళ్లు నడవనున్నాయి.

సీనియారిటీల ప్రకారమే బదిలీలు చేపట్టాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులను సీనియారిటీ ప్రకారమే బదిలీలు చేపట్టాలని, అలాగే కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఎన్నికలను నిర్వహించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు కలిసి విన్నవించారు. శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ మల్లారెడ్డిని తన చాంబర్‌లో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ ఎస్.రాజేశ్, సతీశ్ తదితరులు కలిశారు. తమ సమస్యలను పరిష్కారించాలని కోరగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామని చెప్పినట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు వెల్లడించారు.

హనుమకొండ ఆర్టీఏలో

ఆ ముగ్గురిదే ఇష్టారాజ్యం!

ఎవరి దందా వారిదే.. ఉన్నతాధికారులన్నా లెక్కలేని తనం

భరించలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన అధికారి?

రాంనగర్, సెప్టెంబరు 19: హనుమకొండ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో ముగ్గురు అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందని, వారు ఎవరి దందా వారు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్‌లు తదితర విధులు నిర్వహించే ఈ అధికారులకు ఉన్నతాధికారులంటే లెక్కలేదని, రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, ఓవర్‌లోడ్ లాంటి విషయాల్లో ఈ ముగ్గురు ఎంతంటే అంత అనే చందంగా వ్యవహారం ఉంటోందనే విమర్శలున్నాయి. గత ఉన్నతాధికారి హయాంలో హవా కొనసాగించిన ఈ ముగ్గురు ప్రస్తుత అధికారి మాటలను లెక్కచేయడం లేదని, దీంతో సదరు ఉన్నతాధికారికి ఈ ముగ్గురికి మధ్య విధుల నిర్వహణలో తీవ్ర అభిప్రాయభేదాలు నెలకొన్నాయని, ఉన్నతాధికారి ఆదేశాలను వారు వినిపించుకున్న పాపాన పోలేదని తెలుస్తోంది.

వాస్తవానికి ఈ ముగ్గురిలో ఇద్దరు ఒకవైపు.. మరొకరు ఒకవైపు ఉన్నా.. ఉన్నతాధికారి విషయం వచ్చే సరికి ఆ ముగ్గురు ఒక్కటవుతారని తెలిసింది. శాఖాపరమైన ప్రతీ విషయంలో ఉన్నతాధికారికి ముగ్గురు అధికారులకు మధ్య సఖ్యత లేక ఇబ్బందులు తలెత్తుతుండటంతో పాటు కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులతో ఆ ఉన్నతాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ముగ్గురిని సమన్వయం చేయలేని స్థితిలో, తనకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ ముగ్గురి దందాను అరికట్టడంలో విఫలమైన సదరు ఉన్నతాధికారి విధిలేని పరిస్థితిలో వీలుంటే వేరే జిల్లాకు, లేదంటే వలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మొత్తంగా ముగ్గురు అధికారుల వైఖరి శాఖకు ముప్పు తేవడంతో పాటు ఏకంగా ఓ ఉన్నతాధికారి ఉద్యోగం వదులుకునే పరిస్థితి తీసుకొచ్చిందంటే వారి దందా ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతాం..

ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

నర్సంపేటలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


వైద్యకళాశాలలో ప్రదర్శనకు పెట్టిన అస్థిపంజర నమూనాను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు

నర్సంపేట / నర్సంపేట టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఇక్కడి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రూ.183కోట్లతో నిర్మించిన వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి భవనాన్ని గురువారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి దామోదర మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసిందని, ఫలితంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రం ఏర్పడితే తమ తలరాతలు మారుతాయని, పిల్లల భవిష్యత్తు బంగారు బాట పడుతుందని ఆశించిన ప్రజలకు గత పదేళ్ల అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన ఓరుగల్లు జిల్లాను నాలుగు ముక్కలుగా చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని, అలా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి వరంగల్ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో వరంగల్‌లో మానవ అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్ సౌకర్యాలు, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సెంటర్‌తో పాటు, ట్రామా సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 40శాతం బదిలీలను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. 4వేల వైద్య పోస్టులతో పాటు, 2,050 నర్సింగ్ పోస్టులు, 450 ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేశామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం రూ.400కోట్లు అదనంగా ఖర్చు చేస్తోందని, రాష్ట్రంలో 9 కళాశాలలకు గాను నర్సంపేట మెడికల్ కళాశాలను ప్రారంభించామని, మిగిలిన 8 వైద్యకళాశాలలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు, వైద్య కళాశాలలకు వెళ్లడానికి నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయడంతో పాటు 102, 108, 104 అంబులెన్స్‌లను తీసుకొచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో వైద్య రంగానికి ప్రాధాన్యమిస్తున్న తమ ప్రభుత్వం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి రూ.2వేల కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడానికి కృషి చేస్తోందన్నారు.


స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు చెక్కులను అందజేస్తున్న మంత్రులు


క్యాంటీన్‌లో వంటకాలను రుచి చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

మాది చేతల ప్రభుత్వం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, తొమ్మిదిన్నరేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతలు తాము చేసిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. తాము ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 23లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. ఇంకా రూ.13వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉందని, సాంకేతిక కారణాలతో అవి ఆగాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తామన్నారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే నర్సంపేటలోని మెడికల్ కళాశాల, 170 పడకల జనరల్ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసమే ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల సౌకర్యం కల్పించిందన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కోసం ప్రభుత్వం రూ.657కోట్లను కేటాయించి విద్య పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అన్ని కులాలకు చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు రూ.100 నుంచి రూ.110కోట్లను వెచ్చించామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ పథకం కింద ప్రజలకు తాగునీరు అందలేదన్న విషయం విషయం తాము అధికారంలోకి వచ్చాక నిర్వహించిన సర్వేలో 53శాతం మంది ప్రజలు చెప్పారన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పంట, ఆస్తుల నష్టం భారీగా జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి వరద ప్రాంతాలను స్వయంగా పరిశీలించారని, 44 గంటల్లోనే బాధితులను ఆదుకున్నామన్నారు. త్వరలోనే అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకం కింద 15 నుంచి 20వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఇదంతా ప్రజలు గమనించారన్నారు. ఇక కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకపోయినా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు దొంతి మాధవరెడ్డి అండగా ఉన్నారంటూ మంత్రి పొంగులేటి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మహిళా సంఘాల సభ్యులకు చెక్కులను అందజేశారు. మహిళా క్యాంటీన్‌ను సందర్శించి అక్కడి వంటకాలను రుచిచూశారు.

మహిళల సాధికారత కోసం క్యాంటీన్లు : సురేఖ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వం మహిళలు సాధికారత కోసం క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో నర్సంపేటలో మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మారుమూల గ్రామీణ ప్రాంత మహిళలు హైదరాబాద్‌కు మెరుగైన వైద్యం కోసం తరలివెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాం నాయక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, డీఎంహెచ్‌ఓ వాణి, డీసీపీ రవీందర్, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు బెల్లయ్యనాయక్, రియాజ్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రారంభోత్సవానికి హాజరైన మహిళలు


సీపీకి పూల మొక్క అందిస్తున్న ఏసీపీ భోజరాజు

సీపీని కలిసిన క్రైమ్ ఏసీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19: వరంగల్ కమిషనరేట్ క్రైమ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు గురువారం సీపీని కలిసి మొక్కను అందించారు.

ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి రాజీనామా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపాల్ సీహెచ్. రణధీర్‌రెడ్డి తప్పుకున్నారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందచేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. తన రాజీనామాపై వర్సిటీ రిజిస్ట్రార్ చాంబర్‌లో దాదాపు 3, 4గంటల పాటు చర్చించినట్లు తెలిసింది. అయితే వర్సిటీకి నూతన వైస్‌చాన్స్‌లర్ వచ్చేవరకు ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి రణధీర్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది. అయితే తాను కొనసాగలేనని, తన రాజీనామాను ఆమోదించాలని రణధీర్‌రెడ్డి కోరినట్లు సమాచారం.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19: జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ఇల్లందుల రత్నంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రత్నం కొంతకాలంగా చిరు వ్యాపారస్తులు, కూలీలతో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో దాడి చేసి రూ.వెయి నగదును స్వాధీనం చేసుకుని రత్నంను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం రత్నంను ఘనపూర్ పోలీసులు అప్పగించారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతరకోర్సుల 1, 3, 5 సెమిస్టర్‌ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పి.తిరుమలదేవిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50అపరాధ రుసుంతో అక్టోబరు 4 ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని వారు కోరారు.

బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి

- రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుంది
- హైడ్రాపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి..
- బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్


జనగామలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఈటల రాజేందర్

జనగామ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని, రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుందని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లాకేంద్రంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఈటల అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరచారని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల సరళీకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలు ఉన్నాయన్నారు. అలాంటి తెలంగాణ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసిరాకపోవడం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు.

పేదల ఇళ్లు కూల్చితే సహించం

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చాలని చూస్తే సహించబోమని హెచ్చరించిన ఈటల హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు హైడ్రా శ్రీరామ రక్ష అని సీఎం భావిస్తే అసెంబ్లీలో చర్చకు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చెరువులు, వాగుల రక్షణ జరగాలని, అక్రమ కట్టడాలను అరికట్టాలనే బీజేపీ కూడా కోరుకుంటోందని స్పష్టం చేశారు. తానే తొలి ముఖ్యమంత్రి అయినట్టుగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడే పుట్టినట్టుగా, సమాజహితాన్ని తాను ఒక్కడే కోరుకుంటున్నట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలోని ముఖ్యమంత్రులు తప్పులు చేస్తే తానే సరిదిద్దుతు న్నట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అన్ని రకాల అనుమతులు ఉండి, ఏళ్లుగా ట్యాక్సులు కడుతున్న నిర్మాణాలను చట్టబద్ధత లేని హైడ్రా ద్వారా ఎలా కూల్చుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, నాడు ప్రభుత్వ అనుమతులతో కట్టుకున్న కాలనీలకు సైతం నోటీసులు ఇచ్చి కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలా చేయడానికి తెలంగాణ రేవంత్‌రెడ్డి అబ్బ జాగీరా అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి చెరువుల రక్షణ విషయంలో నిజాయితీ ఉంటే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరిగిన ఆక్రమణలపై ఏం చేయాలన్న దానిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. తన పలుకుబడిని పెంచుకోవడం కోసం, పార్టీలో ఉన్న సమస్యలను దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి ఇలా చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటే కళ్లు నెత్తికి ఎక్కిన కేసీఆర్‌కు ఏ గుణపాఠం చెప్పారో రేవంత్‌రెడ్డికి కూడా ప్రజలు అదే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, విద్యాసాగర్, జిల్లా నాయకులు శివరాజ్‌యాదవ్, రాజశేఖర్, సౌడ రమేశ్, బీజేవైఎం నాయకులు రాజవెంకటనర్సింహారెడ్డి, రవి, రాజేశ్, ఉల్లెంగుల రాజు, కీర్తి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యంలో అందెవేసిన 'చేయి'

- భవిష్యత్తు దిక్సూచి సుదర్శనాచార్యులు
- ఇప్పటికే పలు అవార్డులు, సత్కారాలు
- 22న గౌరవ డాక్టరేట్, స్వర్ణకంకణం బహూకరించనున్న టీటీడీ దేవస్థానం

సంగెం, సెప్టెంబరు 19: జ్యోతిష్యంలో ఆయనకు ఆయనే సాటి.. ఆయన పాండిత్యం అందరిని మంత్రముగ్ధులను చేస్తోంది. గ్రామీణ ప్రాంతంతో పాటు పట్టణాలకు చెందిన వారికి ఆయన జ్యోతిషంపై అపార నమ్మకం. శుభకార్యాలు కానీ, ముహూర్తాలు కానీ, మంచి, చెడు, ప్రయాణాలు, విద్య, వివాహ తదితర ఏ కార్యక్రమానికైనా ఆయన పెట్టిందే ముహూర్తం. చెప్పిందే సత్యం. అదీ ఆయనకు ప్రజలపై ఉన్న నమ్మకం. ఆయనే వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఊకల్ నాగేంద్రస్వామి ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు. బుధవారం ఏకంగా ఇటీవల పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆలయాన్ని సందర్శించడం తో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది.


మాజీ గవర్నర్ రోశయ్య చేతుల మీదుగా జ్యోతిష విశారద అవార్డును అందుకుంటున్న సుదర్శనాచార్యులు (ఫైల్)


పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పట్టాతో..

విద్యాభ్యాసం - అవార్డులు


వరంగల్ జిల్లా సంగెం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కృష్ణామాచార్యులు - విజయలక్ష్మి రెండో కుమారుడు సముద్రాల సుదర్శనాచార్యులు జ్యోతిష్యంలో దిట్ట. వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్నారు. చిన్నప్పటినుంచే పౌరహిత్యం తండ్రి ద్వారా వారసత్వంగా అబ్బింది. చింతలపల్లి, ఊకల్ నాగేంద్రస్వామి ఆలయాల్లో అర్చకత్వం చేస్తే భక్తులకు సేవలందిస్తున్నారు. కాగా, ప్రాథమిక, ఉన్నత విద్యను చింతలపల్లి, సంగెం గ్రామాల్లో పూర్తి చేశారు. పొట్టిశ్రీరాముల తెలుగు యూనివర్సిటీలో జ్యోతిష్యంలో ఎంఏలో పట్టా అందుకున్నారు. 2018లో అప్పటి తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా చెన్నైలో జ్యోతిష్య విశారదను అందుకున్నారు. అంతర్జాతీయ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జ్యోతిష్య ప్రజ్ఞ ప్రావీణ్య, సర్వేజనా సుఖీనోభవంతు సంస్థ నేతృత్వంలో జ్యోతిష్యరత్న అవార్డులను అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో కిందటేడు వేదాంగ జ్యోతిష్య అవార్డును పొందారు. ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీలో హస్తరేఖ ఫలితాలపై పీహెచ్‌డీ చేస్తున్నారు. సముద్రాల సుదర్శనాచార్యులకు భార్య భార్గవి, కుమారుడు శ్రీహర్ష, కూతురు శ్రేయ ఉన్నారు.

టీటీడీ డాక్టరేట్, స్వర్ణ కంకణం

సముద్రాల సుదర్శనాచార్యులకు జ్యోతిష్యంలో ఉన్న పాండిత్యాన్ని గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు.. ఆయనకు స్వర్ణకంకణంతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు తిరుమల దేవస్థానంలో టీటీడీ వేద విజ్ఞాన పరిషత్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే సమ్మేళనంలో వీటిని అందించనున్నారు. ఇప్పటికే సుదర్శనాచార్యులకు టీటీడీ అర్చకుల నుంచి ఆహ్వానం అందింది. దీంతో వరంగల్ నుంచి శుక్రవారం రాత్రి సుదర్శనాచార్యులు తిరుమలకు బయలుదేరి వెళ్లనున్నారు.

ఊకల్ నాగేంద్రస్వామి దయతోనే..

జ్యోతిష్య పండితుడు సముద్రాల సుదర్శనాచార్యులు



ఊకల్‌లో గల నాగేంద్రస్వామి ఆశీర్వాదంతో తండ్రి నుంచి నేర్చుకున్న పౌరహిత్యమే నన్ను ఇంతటి వాడిని చేసింది. ప్రతీ మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తూ స్వామి వారి తీర్థప్రసాదాలను నా కుమారుడు శ్రీహర్ష సహకారంతో భక్తులకు అందిస్తున్నాం. జ్యోతిష్యంపై పాండిత్యం సంపాదించాలన్న పట్టుదలతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా. నాకు తెలిసిన జ్యోతిష్యాన్ని ప్రజలకు చెబుతూ సేవలందిస్తున్నా.. టీటీడీ వారు డాక్టరేట్, స్వర్ణ కంకణం ప్రకటించడం సంతోషంగా ఉంది.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ పోస్టర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరసింహారావు తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పీడీఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు.

ఈ మేరకు శుక్రవారం కేయూలో పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్‌ను నరసింహారావు నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని పేదలకు ఉచిత నాణ్యమైన, కామన్ విద్యను అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రాథమిక స్థాయి నుంచి వర్సిటీల స్థాయి వరకు విద్యను ప్రైవేట్ పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో విద్య వ్యాపారమయమైందని ఎద్దేవా చేశారు. పీడీఎస్‌యూ పేద విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతోందని అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి పోరాటంలో నేతలు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, కోలా శంకర్, శ్రీపాద ప్రసాదరావు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, చేరాలు, వరహాలు, రమణయ్య, మధుసూధన్ రాజ్, మరోజు వీరన్నతో మరెందరో మరణించారని చెప్పారు. వారి త్యాగాలు వృథా కావని అన్నారు. ఓయూలో 50వ పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సంబురాల్లో ఉద్యమాన్ని సమీక్షించి, విద్యార్థి అమరుల స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ నేతలు అశోక్, సంగీత, అనూష, స్వాతి, నరేశ్, పృథ్వీ, అజహర్, రమేశ్, వీరేందర్, రాజు, సునీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుందర్‌రాజ్‌కు బుజ్జగింపులు

- పార్టీ మారకుండా బీఆర్ఎస్ నేతల చర్చలు
- కాంగ్రెస్ నేతలూ భేటీ

రాంనగర్, సెప్టెంబరు 19: మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఆ పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్.. సుందర్‌రాజ్‌తో గురువారం చర్చలు జరిపారు. తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు. బీఆర్ఎస్‌ను వీడవద్దని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుందామని ఆయనకు సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు సైతం సుందర్‌రాజ్‌తో మాట్లాడి పార్టీ మారాలనుకునే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సూచించారు. కాగా, ఒకటిరెండు రోజుల్లో సుందర్‌రాజును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. బీఆర్ఎస్‌ను వీడే విషయమై తన సన్నిహితులతో సుందర్‌రాజ్ రోజంతా చర్చలు జరిపినట్లు సమాచారం.

కాగా, సుందర్‌రాజ్‌తో కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నేతలు చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో సుందర్‌రాజ్‌కు కాంగ్రెస్ కండువా కప్పాలని నిర్ణయం తీసుకున్న నేతలు.. బీఆర్ఎస్ నేతల చర్చలతో సుందర్‌రాజ్ యూ టర్న్ తీసుకునే అవకాశం ఉంటుందని, ఈలోగానే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సుందర్‌రాజ్ చేరికపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించిన కాంగ్రెస్ నేతలు ఒకటిరెండు రోజుల్లో కాంగ్రెస్ కండువా కప్పించే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పార్టీలోకి వస్తే సముచిత స్థానం కల్పించేందుకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఎంజీఎం ఆవరణలోని దుకాణాల్లో అధికారుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 19: ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో అక్రమంగా వెలిసిన దుకాణాలపై జిల్లా యంత్రాంగం దృష్టి కేంద్రీకరించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ఎంజీఎంను సందర్శించిన సందర్భంలో వెలిసిన దుకాణాలపై ఆరా తీశారు. ఈ విషయంలో విచారణ జరపాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఎంజీఎం ఆవరణలో వెలిసిన దుకాణాలపై గురువారం ఆరా తీశారు. తాగునీటి నుంచి మొదలుకొని మాస్కుల వరకు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నట్లు రోగులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా ఎమ్మార్పీతో సంబంధం లేకుండా విక్రయాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. నాసిరకం సరుకులు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు కూడా కొందరు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన విచారణలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.



ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్ట్

గిర్మాజిపేట, సెప్టెంబరు 19 : నాలుగు నెలల క్రితం చింతల్‌పల్లి- ఎలుగూరు రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న కలకొండ మహేందర్ (28) కేసులో మృతుడి పెద్దనాన్న కలకొండ వెంకటనారాయణ, పెద్దమ్మ, సోదరిలను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు వరంగల్ జీఆర్‌పీ ఎస్సై మోయినుద్దిన్ తెలిపారు. సంగెం మండలం కుంటపల్లికి చెందిన మహేందర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడని ఎస్సై తెలిపారు. అయితే పెద్దనాన్న వెంకటనారాయణ, అతని భార్య, కూతురు డబ్బుల విషయంలో మహేందర్‌తో గొడవపడటంతో ఈ ఏడాది మే14న మహేందర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మహేందర్ ఆత్మహత్యకు ప్రేరేపించారంటూ మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

'స్ఫూర్తి ప్రదాత నరసింగం గుప్తా'


మాట్లాడుతున్న రామచంద్రం

గిర్మాజిపేట, సెప్టెంబరు 19: స్వాతంత్ర్యానికి పూర్వమే నగరంలో విద్యా సంస్థలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి విద్యను అందించిన స్ఫూర్తి ప్రదాత దివంగత ఆకారపు నరసింగం గుప్తా అని కేయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. గురువారం విశ్వేశ్వరయ్య సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో కళాశాల పాలక కమిటీ అధ్యక్షుడు ఆకారపు హరీష్‌కుమార్ గుప్తా అధ్యక్షతన కళాశాల వ్యవస్థాపకులు ఆకారపు నరసింగం గుప్తా వర్ధంతి నిర్వహించారు. రామచంద్రం మాట్లాడుతూ విద్యతోనే సామాజిక అసమానతలు, రుగ్మతలు తొలగిపోతాయన్నారు. వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకళాశాల, శ్రీవిశ్వేశ్వరయ్య సంస్కృతాంధ్ర డిగ్రీ,పీజీ కళాశాల, ఎ.ఎస్.ఎం మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, సుశీలదేవి ఉన్నత పాఠశాల తదితర విద్యా సంస్థల ద్వారా లక్షలాది విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్యతో పాటుగా ఆయుర్వేద వైద్య విద్యను కూడా అందించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మేకల లింగమూర్తి,జయకృష్ణ,శ్రీదర్ల కుమార్, శెట్టి దేవరాజు, సుస్మిత, సిబ్బంది రవీందర్, రాజు, లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేయూ టోర్నమెంట్ ఎంపికలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కళాశాల మహిళ టోర్నమెంట్ క్రీడాకారుల ఎంపికలు సెప్టెంబరు 20 శనివారం నుంచి 22వ తేదీ సోమవారం వరకు సాగుతాయని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి వరంగల్ బొల్లి కుంటలోని వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల గ్రౌండ్‌లో జరిగే ఎంపికల ప్రారంభం కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

విశిష్ట అతిథిగా విశ్వంభర ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, అతిథులుగా కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, వాగ్దేవి కళాశాల బాధ్యులు డాక్టర్ సి. సత్యపాల్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్. వాణి, డాక్టర్ సీహెచ్. సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ వై. మధుసూదన్‌రావులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. నిర్వాహకులుగా డాక్టర్ పి. అజయ్‌రెడ్డి, డాక్టర్ ఎం. రాధాకృష్ణలు వ్యవహరిస్తారు.

పీహెచ్‌డీ సీటు విషయమై ఫిర్యాదులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ఫార్మసీ విభాగంలో పీహెచ్‌డీ సీటు ఆశ వాహుడైన బొట్ల మనోహర్‌లు పరస్పరం ఒక్కరిపై మరొకరు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. తనకు పీహెచ్‌డీ సీటు ఇవ్వకపోతే చంపుతానని బొట్ల మనోహర్‌తో పాటు బెదిరించారని గురువారం రాత్రి వర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఫిర్యాదు చేశారు. అలాగే తన కు చదువు రాదని ప్రొఫెసర్ సమ్మయ్య హేళన చేశారని, తనకు ఆయనతో ప్రాణహానీ ఉందని బొట్ల మనోహర్ శుక్రవారం వర్సిటీ పోలీస్ స్టేషన్‌లో వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడం వర్సిటీలో కలకలంగా మారింది. వారిద్దరి ఫిర్యాదుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పోతన రోడ్డును పట్టించుకోరా ?

- జంక్షన్ లేని వై ఆకారం రోడ్డు
- రోడ్డు పక్కన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- కల్వర్టుతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని పాలకులు


రోడ్డు మధ్యలో ఉన్న మురికి కాలువ కల్వర్టు


జంక్షన్‌లేని హంటర్ పోతన వై ఆకారం రోడ్డు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 19: వేలాది వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే పోతన రోడ్డు ప్రమాకరంగా మారింది. భారీ వాహనాలు వెళ్తుండడంతో చాలాచోట్ల రోడ్డు ధ్వంసమైంది. దీనికి తోడు దారి మొత్తం ఇరుకుగా మారడంతో ప్రమాదకరంగా మారింది. అసలే ఇరుకు రోడ్డు ఆపై భద్రకాళి బండ్ నిర్మాణ పనులు దీనితో వాహనం వెనుక వాహనాలు వెళ్లే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డును అభివృద్ధి పర్చాలని స్థానిక ప్రజలు వినతులు సమర్పించినా అధికారులు పట్టించుకోవడం లేదు. జెమిని థియేటర్ మూల మలుపు నుంచి ప్రారంభమయ్యే పోతన రోడ్డు పోతన విజ్ఞాన పీఠం ముందుగా మూలమలుపు హంటర్‌రోడ్డు వరకు అతి చిన్నగా రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు స్తంభాలతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, మురికి కాల్వ..

ఈ రోడ్డు వెంట నివాస గృహాలు ఉన్నాయి. మరో పక్క మురికి కాల్వ ఉంది. వీటికి తోడు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. గతంలో వినతులు వెళ్లినా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం లేదు. ఈ రోడ్డు గుండా వెళ్తుంటే మురికి కాలువ అవతలకు ఓ ప్రార్థనా మందిరం, శ్మశానవాటిక, నివాస గృహాలు ఉన్నాయి.

వై ఆకారం రోడ్డులో జంక్షన్ ఏది ?

అదాలత్ సెంటర్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి హంటర్‌రోడ్డు నుంచి వెళ్లే ప్రధాన రహదారి పోతన రోడ్డుకు వెళ్లే దారి గుండా నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పోతన రోడ్డు మూలమలుపు హంటర్‌రోడ్డు వద్ద వై ఆకారంలో ఉన్న ఈ రోడ్డుకు జంక్షన్ లేక తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. ఈ ప్రాంతంలో జంక్షన్ హైల్యాండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా కలప దందా



రోడ్డుపై మరమ్మతుకు గురైన కలపను తరలిస్తున్న ట్రాక్టర్

కాశిబుగ్గ, సెప్టెంబరు 19: నగరంలో ఇష్టారాజ్యంగా కర్ర దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. కాశిబుగ్గ, ఎల్‌బీ నగర్‌లో ఉదయం వేళల్లో ట్రాక్టర్లలో కర్రను తీసుకువస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీశాఖ అనుమతుల మేరకు చెట్లు నరకాల్సి ఉన్నా.. ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లు నరికి కొంతమంది ప్రకృతిని దెబ్బతీస్తున్నారు. నిత్యం వాహనాల్లో కలప వస్తోందని కాశిబుగ్గ, ఎల్‌బీనగర్ వాసులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. గురువారం కర్ర లోడుతో ఉన్న ట్రాక్టర్ కాశిబుగ్గలో మరమ్మతుకు గురైంది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. కర్ర లోడు ట్రాక్టర్ వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడంతో అక్రమ కర్ర దందాను స్థానికులు చర్చించుకున్నారు.

మున్నూరుకాపు సంఘం వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా గోపి



కేసముద్రం, సెప్టెంబరు 19: మున్నూరుకాపు సంఘం వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కేసముద్రానికి చెందిన సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపిని నియమించినట్లు రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుట్టం పురుషోత్తంరావు తెలిపారు. హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నియామకం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులకు జరిమానా.. ఇద్దరికి జైలు

మట్టెవాడ, సెప్టెంబరు 19: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 28 మంది వాహనదారులకు జరిమానా, ఇద్దరు ఇద్దరు వాహనదారులకు జైలుశిక్షను గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 28మంది వాహనదారులకు రూ.33,500 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన పది మంది వాహనదారులకు రూ.11,800 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్టు : ఏసీపీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 19: రోడ్డుకు అడ్డంగా ఆటో పెట్టడమేకాక, బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై ఉమ్మడంతో అతడు ప్రశ్నిస్తే కర్రలతో దాడి చేసిన వారిని అరెస్టు చేసినట్టు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. గురువారం వరంగల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాడికి పాల్పడిన కరీమాబాద్‌కు చెందిన నమ్మనికోట్ల మల్లికార్జులన్ అలియాస్ మల్లేశ్, కాశిబుగ్గకు చెందిన గడ్డం అలియాస్ సమోసా సంపత్ అలియాస్ ప్రశాంత్‌లను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈనెల 12న ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన ఆకుతోట సంతోష్ తన పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా, బీఆర్‌నగర్ సెంటరు వద్ద మల్లికార్జున్, సమోసా సంపత్‌లు రోడ్డు మీద అడ్డంగా ఆటో పెట్టుకొని ఉండి ఆకుతోట సంతోష్ మీద మల్లికార్జున్ ఉమ్మి వేశాడన్నారు. దాంతో ఎందుకు ఉమ్మావు, చూసుకోవాలని అన డంతో వారు బైక్‌పై వెళ్తున్న సంతోష్‌ను విచక్షణారహితంగా కర్రతో, చేతులతో దాడి చేసినట్టు తెలిపారు. సంపత్ ఇచ్చిన ఫిర్యాదు బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాల దగ్గర నిందితులు మల్లికార్జున్, సంపత్‌లను అరెస్టు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఎస్ఐ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పాత నేరస్తులే..

మల్లికార్జున్ 2004లో మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని చంపి, ఆ కేసులో 11 ఏళ్లు జైలు శిక్ష అనుభవించి 2016లో జైలు నుంచి విడుదలయ్యాడు. గతంలో గీసుగొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఆయుధాలు కలిగి ఉన్న కేసు నమోదైంది. గడ్డం సంపత్ 2018లో మేడారం జాతరలో మర్డర్ చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. సంపత్ మీద వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో అటెంప్ట్ మర్డర్ కేసు, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు, నల్గొండ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అటెంప్ట్ మర్డర్ కేసు, ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. ఇద్దరిపై సుబేదారి, హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 19: నగరంలో ఈనెల 10న జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరెపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకన్న గురువారం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులు ఎస్‌కే గుడియా, ఎస్‌కే యాస్మిన్, ఎస్‌కే గుల్షన్, కె.శశాంక్‌లను పాఠశాలలో అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 21 నుంచి 23 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజారి అశోక్‌బాబు, ఏఏపీ ఛైర్మన్ సరోజన పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి : సీపీఐ

ఖిలావరంగల్, సెప్టెంబరు 19: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శివనగర్‌లోని తమ్మె రభవన్‌లో గుండే బద్రీ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ వరంగల్ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మూడో మహాసభలుయ కొత్తగూడెంలో జరుగుతాయన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా నష్టపోయిన క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈమేరకు మహాసభ నూతన కమిటీ 21 మందితో ఎన్నికైంది. జిల్లా గౌరవాధ్యక్షుడుగా గన్నారపు రమేష్, సలహాదారులుగా చెన్నకేశవులు, జిల్లా అధ్యక్షుడిగా ఎమ్డీ అక్బర్‌పాషా, ఉపాధ్యక్షులుగా జన్ను రాజు, దుండగుల అశోక్, వద్యాల రంజిత్, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా సహాయ కార్యదర్శులు దామెర కృష్ణ, తాళ్లపెల్లి జాన్‌పాల్, జిల్లా ఉపాధ్య క్షులు ఎమ్డీ యాకూబ్‌పాషా, ఎమ్డీ ఖాసీం, ఆటో డ్రైవర్స్ చిరంజీవి, కుమార్, కర్ణాకర్, ఇసాక్, రాజు, రంజిత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాషుమియా

'బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి'


41వ డివిజన్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ప్రదీప్‌రావు, రవీందర్

శంభునిపేట, సెప్టెంబరు 19 : దేశాన్ని ప్రపంచానికి పెద్దన్నగా మార్చిన బీజేపీతోనే తెలంగాణ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. విశేష్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా నగరంలోని 41వ డివిజన్‌లో నాయకులు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ సభ్యత్వ చేపట్టారు. ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక మంది కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దం నరేష్, కనుకుంట్ల రంజిత్, శేర్ల అనిల్ కుమార్, మిట్టపల్లి కపిల్, తాబేటి వెంకట్ గౌడ్, బూత్ అధ్యక్షులు గోపి, సోమరాజ్, రమేష్, పాల్గొన్నారు. 42వ డివిజన్ బీజేపీ నాయకులు తాళ్లపల్లి అర్జున్, బక్కి రంజిత్‌ల ఆధ్వర్యంలో రంగశాయిపేటలో చేపట్టిన బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రదీప్‌రావు పాల్గొన్నారు. బూత్ స్థాయిలో సభ్యత్వాలను పెంచుకోవాలని డివిజన్ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, శేర్ల అనిల్ కుమార్, చాపల నాగరాజు, ఆరె కార్తిక్, దుబ్బాల అశోక్, దూడ పరమేష్, బోయిని రాజు, దారబోయిన అనిల్, ఇమ్మడిశెట్టి కిషన్, రాధాకృష్ణ, గోపి, సురేష్, శివ, కత్తి సోని, రమాదేవి, వాణి, పార్వతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారి కార్యాలయం మార్పు

త్వరలో ఆర్ఏఆర్ఎస్‌లోని రైతు శిక్షణ కేంద్రంలోకి ?

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 19: వరంగల్ వ్యవసాయ అధికారి కార్యాలయం కొన్నేళ్లుగా హనుమకొండ అదాలత్ వెనుక వైపు ఓ పురాతన భవనంలో ఉంది. సరైన వసతులు లేక ఏళ్ల నుంచి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల భువనగిరి యాదాద్రి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన వరంగల్ డీఏవో అనురాధ కార్యాలయ పరిస్థితిని చూసి అవాక్కయ్యారు. చిన్నచిన్న గదులు, ఓ ఇంటినే కార్యాల యంగా మార్చడంతో ఒక జిల్లాస్థాయి కార్యాలయానికి ఉండా ల్సిన లక్షణాలేమి లేకపోవడంతో ఇబ్బందిపడ్డారు. మరోపక్క జిల్లాలో నుంచి రైతులు కార్యాలయానికి వచ్చి అధికారులతో కూర్చుని మాట్లాడేందుకు, వాహనాలు పార్కింగ్ చేసుకు నేందుకు కూడా తగిన వసతులు లేకపోవడంతో డీఏవో అను రాధ సమస్యను కలెక్టర్ సత్యశారద దృష్టికి తీసుకెళ్లినట్లు తెలి సింది. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని రైతు శిక్షణ కేంద్రంలోకి కార్యాలయాన్ని తరలించేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చినట్టు తెలిసింది. త్వరలోనే హనుమకొండ నుంచి వరంగల్ డీఏవో కార్యాలయం మారడం ఖాయమని తెలుస్తోంది.


ప్రస్తుతం హనుమకొండలో ఉన్న డీఏవో కార్యాలయం

క్రీడాకారుల వివరాలు సమర్పించాలి

కాశిబుగ్గ, సెప్టెంబరు 19: జిల్లాలోని క్రీడాకారులు తమ వివరాలను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఈనెల 23లోగా అందించాలని జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ క్రీడా పాలసీని ఏర్పాటు చేసిందని, దీనిలో భాగంగా క్రీడాకారుల వివరాలను సేకరించడానికి నిర్ణయించినట్టు పేర్కొన్నారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతయ స్థాయిలో పాల్గొన్న, ప్రతిభ చూపిన వారు యువజన, క్రీడల శాఖల కార్యాలయంలో తమ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ ఫొటోలతో కూడిన వివరాలను అందించాలని సూచించారు.

అధ్వానంగా రోడ్లు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కాశిబుగ్గ, సెప్టెంబరు 19: కాశిబుగ్గ రహదారులు అధ్వానంగా మారాయి. ఏ వీధి చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఎగుడు దిగుడు మార్గాలతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గతుకుల రోడ్లపై ప్రయాణించడానికి ఆటో డ్రైవర్లు ఆసక్తి చూపించడం లేదు. రోడ్లు సరిగా లేనికారణంగా ఆటో డ్రైవర్లు కిరాయిని సైతం వదులుకుంటున్న పరిస్థితి. కాశిబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఉన్నా.. ఇక్కడి అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నేతలు సైతం పెద్దగా దృష్టి సారించకపోవడంపై 19,20వ డివజన్ల ప్రజలు పెదవి విరిస్తున్నారు. నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల పేరుతో కొన్ని చోట్ల ప్యాచ్‌వర్క్‌లు చేశారు. ప్యాచ్‌వర్క్‌లు చేసి చేతులు దులుపుకోకుండా నాణ్యమైన పటిష్టమైన రోడ్లు వేయాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఓ సిటికి వెళ్లే మార్గంలో, మార్కెట్‌కు వెళ్లేదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. ఈరోడ్లు సైతం సరిగా లేవు. తిలక్ రోడ్డులో మరమ్మతు పేరిట కొద్ది రోజులుగా రాకపోకలను నిలిపివేశారు. నాణ్యమైన సీసీ రోడ్లు అన్ని వీధుల్లో నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఎంతైన ఉంది.


ఓ సిటికి వెళ్లేదారిలో ధ్వంసమైన రోడ్డు


అస్తవ్యస్తంగా ఉన్న తిలక్ రోడ్డు

కస్తూర్బాలో ఎమ్మెల్యే రేవూరి తనిఖీలు



వసతుల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, సెప్టెంబరు 19: వంచనగిరి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్‌హాల్, వంటగది, స్టోర్‌రూం, డిజిటల్ క్లాస్‌రూంలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు చెప్పాలని స్పెషల్ ఆఫీసర్ హిమబిందుకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మెను ప్రకారం విద్యార్థినులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం మంత్రికి చెక్కు అందజేత



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న మైత్రి గ్రూపు సభ్యులు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 19 : వరద బాధితుల సహాయం కోసం నర్సంపేట పట్టణానికి చెందిన మైత్రి గ్రూపు సభ్యులు రూ.50వేల చెక్కును గురువారం నర్సంపేట మెడికల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మైత్రి గ్రూపు సభ్యులు శ్రీరాం కిరణ్, బిట్ల మనోహర్, కూచన సంతోష్, డాక్టర్ పడాల రాహుల్, శరత్‌చంద్ర, చంద్రశేఖర్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జష్నె ఈద్‌మిలాద్ ఉన్ నబీ వేడుకలు



నర్సంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 19 : పట్టణంలో జష్నె ఈద్ మిలాద్ ఉన్ నబీ (మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు) వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మల్లంపల్లిరోడ్‌లో గల జమాలే బహార్ దర్గా నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు జులూస్ (ర్యాలీ) నిర్వహించారు. ర్యాలీలో ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తూ మహ్మద్ ప్రవక్త నినాదాలు చేశారు. అనంతరం మత పెద్దలు మౌలానా షాహిద్‌రజా, మౌలానా రియ్యాన్ రజా మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన శాంతిమార్గంలో నడుస్తూ జీవితం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, షేక్ రషీద్, యాకూబ్, హాజీపాష, బుడెన్, హఫీజ్, ఖలీల్, అఖిల్, సర్దార్, జాహెద్, మహబూబ్, మజీద్, సాదిక్, ఖాదర్, సోను, మున్ను, అఫ్రోజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన సేవలందించాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 19 : వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్, జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని సీహెచ్‌సీ సందర్శించారు. వైద్యురాలితో మాట్లాడి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పేరుకే ఏరియా ఆస్పత్రిగా ఇంకా అధికారికంగా సీహెచ్‌సీ సేవలే అందిస్తున్నారని ఆరోపించారు. తగిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, అధికారులు నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, అశోక్, వెంకటస్వామి, మురళీకృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

రోజూ తాగునీరు అందిస్తాం

రూ.2 కోట్ల వ్యయంతో వాటర్‌ట్యాంక్, పైపులైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

మహిళా సంఘాలకు రూ.2 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొంగులేటి, దామోదర, సురేఖ

నర్సంపేట, సెప్టెంబరు 19 : పట్టణ ప్రజలకు 365రోజుల పాటు వచ్చే వేసవి కాలం నాటికి తాగునీటిని అందిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. అమృత్ 2.0 పథకం కింద రూ.30.49 కోట్ల అంచనా వ్యయంతో 6లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, అంతర్గత పైపులైన్ నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదరరాజనర్సింహ, కొండా సురేఖలు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాగునీటి అందించడంలో విఫలం చెందింద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాగునీటికి ప్రాధాన్యత నిస్తుందన్నారు.ఖానాపురం మండలం అయోధ్యనగర్ వద్ద డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు వినియోగంలోకి తీసుకువచ్చి నిరంతరం తాగునీటి సరఫరా చేయడానికి రూ.12కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

అలాగే నియోజకవర్గంలోని 50 నుంచి 60వేల జనాభా కలిగిన గిరిజనుల సంక్షేమం కోసం నర్సంపేట మండలం లోని రాజుపేటలో రూ.2.50కోట్లతో బంజార భవనం నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. మౌలిక వసతులు, రహదారులు తదితర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులకోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే 15 స్వయం సహాయక సంఘాలకు రూ.2కోట్ల విలువైన చెక్కులను సంఘాల ప్రతినిధులకు మంత్రులచే అందించారు.

బేకరీలో కాలం చెల్లిన ఫుడ్

• తనిఖీల్లో చూసీచూడనట్టు వ్యవహరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

• అధికారి తీరుపై స్థానికుల మండిపాటు



బేకరీలో కాలంచెల్లిన లిక్విడ్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 19 : బేకరీ నిర్వాహకుడు నాణ్యతలేని తినుబండారాలను విక్రయించిన యజమానిపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి, గురువారం తనిఖీకి వచ్చిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇలాంటివి షరామామూలే అని పేర్కొనడంపై స్థానికులు మండిపడుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం. వర్ధన్నపేట లోని బెంగుళూరు బేకరీలో ఈనెల 18న కడమంచె ఖాదర్ అనే యువకుడు ఎగ్‌పఫ్ తిని అస్వస్థకు గురై, ఆస్పత్రిపాలయ్యాడు. ఈ విషయంలో వివిధ పత్రికల్లో, సోషల్ మీడియాలో రావడంతో గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తనిఖీ చేశారు. ఆ సమయంలో బేకరీలో అపరిశుభ్రం ఎక్కువగా ఉండడంతో ఇన్‌స్పెక్టర్ ఎంతో సున్నితంగా బేకరి యజమానికి సూచనలు చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. బేకరీలో కాలం చెల్లిన మలాస్ బ్లూ బెర్రీ క్రష్ అనే లిక్విడ్ (కూల్ కేక్‌లో ఫ్లేవర్‌గా వాడతారు)బాటిల్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుర్తించారు. గత సంవత్సరం నవంబరుకే కాలం చెల్లినా పట్టించుకోలేదు. తయారీ రూంలో అపరిశుభ్రంగా ఉన్నా, క్లీన్ చేసుకోవాలని యజమానికి హితవు పలికారు. కనీసం చేతులకు గ్లౌసులులేకుండానే కేకులను తయారుచేసినా ఆయన పట్టించుకోలేదు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బేకరీకి ఫుడ్ కంట్రోల్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి లేదన్నారు. బేకరీ యజమాని విజ్ఞప్తి మేరకు ఒక ఛాన్స్ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవస్థలో ఇలాంటివి చూసి చూడనట్లుగా వదిలేయాలని పేర్కొన్నారు. తాత్కాలికంగా బేకరీని మూసివేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్ట్

గిర్మాజిపేట, సెప్టెంబరు 19 : నాలుగు నెలల క్రితం చింతల్‌పల్లి-ఎలుగూరు రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న కలకొండ మహేందర్ (28) కేసులో మృతుడి పెద్దనాన్న కలకొండ వెంకటనారాయణ, పెద్దమ్మ, సోదరిలను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు వరంగల్ జీఆర్‌పీ ఎస్సై మోయినుద్దిన్ తెలిపారు. సంగెం మండలం కుంటపల్లికి చెందిన మహేందర్ డ్రైవర్‌గా పనిచేసు కుంటూ జీవనం సాగించేవాడని ఎస్సై తెలిపారు. అయితే పెద్దనాన్న వెంకటనారాయణ, ఇతని భార్య కూతురు డబ్బుల విషయంలో మహేందర్‌తో గొడవపడడంతో ఈ ఏడాది మే14న మహేందర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మహేందర్ ఆత్మహత్యకు ప్రేరేపించారంటూ మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇది ప్రజా పాలన ప్రభుత్వం కాదు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లిలో పెద్ది సుదర్శన్‌రెడ్డి హౌస్ అరెస్టు



నల్లబెల్లిలో సుదర్శన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

నల్లబెల్లి, సెప్టెంబరు 19 : నర్సంపేటలో మెడికల్ కాలేజీకి మంత్రుల రాక సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని నల్లబెల్లిలో ఆయన ఇంట్లో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా పాలన ప్రభుత్వం కాదు అన్నారు. సమస్యలు అడిగితే అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అప్పుల పాలైన సర్పంచ్‌లను బిల్లులు చెల్లించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం అక్రమంగా అర్ధరాత్రులు అరెస్టు చేయడం ఎంతవరకుసమంజసమన్నారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నన్నబోయిన రాజారాం, ఫోరం ఉపాధ్యక్షులు లావుడ్య తిరుపతి, కార్యదర్శి గోనె శ్రీదేవి, సిద్దూరి రత్నాకర్‌రావు, ఊరడి అమరేందర్, లునావత్ వెంకన్న ఉన్నారు.

• ఖానాపురం : మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు గురువారం తెల్లవారు జామున ముందస్తుగా అరెస్ట్‌చేశారు. మంత్రుల పర్యాటన ముగిసిన తరువాత పోలీస్‌ల అదుపులో ఉన్న తాజా మాజీ సర్పంచ్‌లకు విడిచిపెట్టారు. తాజా మాజీ సర్పంచ్‌లు గుగులోతు అశోక్, గుగులోతు సుమన్, హట్యానాయక్, వెంకన్ననాయక్ మాట్లాడుతూ అప్పులు చేసి గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌ల ఫోరం తరుపున ప్రభుత్వ పెద్దలను కలిసి సమస్యలను విన్నవించాలని చూస్తే పోలీస్ యంత్రాంగం నేరగాళ్ల లెక్క అర్ధరాత్రి ఇండ్లలోకి వచ్చి అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు.

• దుగ్గొండి : బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను బుధవారం రాత్రి పోలిసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో తిమ్మంపేట మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్, తొగర్రాయి మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, మందపల్లి మాజీ సర్పంచ్ మొగ్గం మహేందర్, ముద్దునూర్ మాజీ సర్పంచ్ రేవూరి సురేందర్‌రెడ్డి, గొల్లపల్లి మాజీ సర్పంచ్ నీలం పైడయ్యలను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుగ్గొండి, సెప్టెంబరు 19 : ప్రాథమికస్థాయిలో విద్య బలోపేతం కోసం ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పాఠశాలలో ప్రవేశపెట్టి విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు రాబట్టడం జరుగుతుందని జిల్లా మానిటరింగ్ అధికారి సృజన్‌తేజ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాచినపల్లి, దుగ్గొండి, మల్లంపల్లి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు గురువారం సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో వెంకటేశ్వర్లు, హెచ్ఎం రామ స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎంలు జ్యోతిలక్ష్మి, భద్రమ్మ, దేవేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఖానాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేవిధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్‌తేజ అన్నారు. బుధరావుపేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్‌లో కనీస పరిజ్ఞానం అందేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో చరణ్ సింగ్, బుధరావుపేట కాంప్లెక్స్ హెచ్ఎం ఆరిఫ్ హుస్సేన్, సీఆర్పీలు భాస్కర్, రమేష్, వీరస్వామి పాల్గొన్నారు.

• పర్వతగిరి : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పర్వతగిరి, సంగెం మండలాల తెలుగు భాషాఉపాధ్యాయుల అప్పర్ ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్ఎం పాక రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులను నేషనల్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు సిద్ధం చేయాలని, లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను ఖచ్చితంగా అమలుచేయాలని సూచించారు.

ఈ సమావేశానికి రిసోర్స్‌పర్సన్ డాక్టర్ మడత భాస్కర్, సీఆర్పీలు ప్రవీణ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ: అంకితభావంతో విధులను నిర్వహించినప్పుడే వృత్తికి న్యాయం చేయడమే కాకుండా ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపును పొందుతారని నెక్కొండ స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఎం.రంగారావు అన్నారు. నెక్కొండలో జరిగిన తెలుగు స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్న తెలుగు భాషోపాధ్యాయురాలు, చెన్నారావుపేట కస్తూర్బా గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అనుముల తేజస్విని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బి. రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ భాషగా హిందీ



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్ సుమన్

ఖానాపురం.సెప్టెంబరు 19 : హిందీ జాతీయ భాషగా, రాజ భాషగా, అంతర్జాతీయ భాషగా గుర్తింపు పొందిందని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి (డీఐఈవో) డాక్టర్ గంగిశెట్టి శ్రీధర్ సుమన్ అన్నారు. హిందీ భాష పక్షోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన హిందీ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.ఆయన మాట్లాడుతూ నేడు అన్ని సామాజిక వర్గాల్లో హిందీ ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. అనంతరం హిందీ అధ్యాపకురాలు రమాదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, లైబ్రేరియన్ సుధీర్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరాచకపు సదానందం, అధ్యాపకులు విజయ్‌కుమార్, తిరుపతమ్మ, రవికుమార్, సంజీవ, రాజేష్ అతదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

దుగ్గొండి, సెప్టెంబరు 19 : ప్రమాదవశాత్తు ట్రాన్స్ ఫార్మర్ దగ్గర విద్యుత్ వైర్లు తగిలి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మంపేటలో గురు వారం చోటుచేసుకుంది. రైతు బారపాక సాంబయ్య కథనం ప్రకారం.. వ్యవసాయ భూమి దగ్గర మేత కోసం దుక్కిదున్నె ఆవును వదిలి పెట్టగా మేత మేసుకుంటూ ట్రాన్స్‌పార్మర్ దగ్గరకు పోయి ప్రమాదవ శాత్తు విద్యుత్ వైర్లకు తగలగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ సుమారుగా రూ:50 వేలు ఉంటుంది. విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవును స్థానిక వెటర్నరీ డాక్టర్ బాలాజీ పంచనామా నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



భద్రమ్మ (ఫైల్)

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 19: పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన నర్సంపేట మండలం గార్లగడ్డతండాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గార్లగడ్డతండాకు చెందిన పాల్తీయ భద్రమ్మ (42) భర్త వీరన్న మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, వీరికి ఉన్న మూడు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిని నష్టం వాటిల్లింది. ఇటు పంట నష్టం జరగడం, మూడు నెలల క్రితమే భర్త మరణించడం, మరో వైపు పంటల కోసం చేసిన రూ.12 లక్షల అప్పు తీర్చలేక మనస్తాపంతో భద్రమ్మ ఈ నెల17న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నాటినుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన లారీ

రాయపర్తి, సెప్టెంబరు 19: అదుపుతప్పి లారీ పొలంలోకి దూసుకెళ్లడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మైలారంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనంప్రకారం.. మైలారంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై వరంగల్ నుంచి తొర్రూరు వెళ్తున్న లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో డ్రైవర్ ధీరా రామ్‌పాల్‌కు వెన్నుపూస వద్ద తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు 108 సహాయంతో ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని ఇల్లందలో ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం... ఇల్లందలోని పాలకేంద్రం నుంచి గాంధీ సెంటర్‌కు ఆటో వెళ్తుండగా అటుగావస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు కాగా, వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

నెక్కొండ, సెప్టెంబరు 19 : రైతుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రగతి భవనం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడంతో ముందస్తుగా గురువారం బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సొసైటీ చైర్మన్ మారం రాము, నాయకులు తోట సాంబయ్య, కర్పూరపు శ్రీనివాస్, మహమ్మద్ ఖలీల్, చీకటి ఉపేందర్, మంగిశెట్టి కొమ్మాలు, సారంగపాణి, భూపతి వీరేష్, రాజు తదితరులను అరెస్టు చేశారు.

నిరుపయోగంగా మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్



నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్

పర్వతగిరి, సెప్టెంబరు 19: మండలంలోని కొంకపాక గ్రామంలో గొల్లపల్లి షాపూర్‌కు వెళ్లే రోడ్డులో నిర్మించిన వాటర్‌ట్యాంకు నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఆరేళ్లక్రితం రూ.75 లక్షలతో నిర్మించి ప్రారంభించిన వాటర్‌ట్యాంకులో అధికారులు తాగునీటిని నిల్వచేయకపోవడంతో పనికిరాకుండాపోతోంది. గ్రామంలో కేవలం ఒకే వాటర్‌ట్యాంక్ ఉండడంతో గ్రామానికంతటికీ తాగునీరు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంకును వినియోగంలోకి తేవాలని పలువురు గ్రామస్థులు డిమాండ్‌చేస్తున్నారు.

కాలిన ట్రాన్స్‌ఫార్మర్ - ఎండిన పంట

గీసుగొండ, సెప్టెంబరు 19 : మండలంలోని కొమ్మాల, విశ్వనాథపురం పరిధిలో సొందరుబోడు వద్ద గల ట్రాన్స్‌పార్మర్ కాలిపోవడంతో 18ఎకరాల్లో వరిపంట ఎండిపోయిందని రైతులు వాపోయారు. 20రోజుల క్రితం ట్రాన్స్‌పార్మర్ కాలిపోగా విద్యుత్ అధికారులకు తెలిపామని రైతు నరేష్ చెప్పారు. ఈ ట్రాన్స్‌పార్మర్ కింద ఉన్న 16బోరుబావుల ద్వారా వరిపంట సాగుచేసినట్లు తెలిపారు. అయితే కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో కరెంటులేక వరిపంటకు నీరు అందించే పరిస్థితిలేదన్నారు.ఈ విషయమై ఏఈని వివరణకోరగా రైతులు 4రోజులు క్రితమే కాలిపోయిన సమాచారంఇచ్చారని రెండు రోజుల్లో ఏర్పాటుచేస్తామని తెలిపారు.

క్రీడాకారులు వివరాలు సమర్పించాలి

కాశిబుగ్గ, సెప్టెంబరు 19 : జిల్లాలోని క్రీడాకారులు తమ వివరాలను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఈ నెల 23లోగా అందించాలని జిల్లా యువజన, క్రీడల అధికారిణి సత్యవాణి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధికోసం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ క్రీడాపాలసీని ఏర్పాటు చేసిందని, క్రీడాకారుల వివరాలను సేకరించడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఎంకేపీఎస్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా గోపి



కేసముద్రం, సెప్టెంబరు 19 : మున్నూరు కాపు సంఘం (ఎంకేపీఎస్) వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కేసముద్రానికి చెందిన సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపిని నియమించినట్లు రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుట్టం పురుషోత్తంరావు తెలిపారు. హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నియామకం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటుకు గ్రామసభ

పర్వతగిరి, సెప్టెంబరు 19 : మండలంలోని ఏబీతండా పరిధిలోని మూడు తండాలతో నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రజల కోరిక మేరకు గురువారం గ్రామ సభ నిర్వహించినట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. ఏబీతండా పంచాయతీ పరిధిలోని ఉట్టితండా, ఆక్యాతండా, బోటికాడితండా గ్రామాలు గ్రామ పంచాయతీకి సుమారు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయని, మూడు ఆవాసాలను కలిపి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రజల కోరిక మేరకు గ్రామ సభ నిర్వహించి జిల్లా కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన తెలిపారు.

హైవే పై దుమ్ము.. ప్రజల తిప్పలు



వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 19 : హైవే పై డస్ట్ తిప్పలు మళ్లీ మొదలయ్యాయి. మండలంలోని ఇల్లంద గ్రామంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పై భారీగా లారీల్లో డస్ట్ లారీలు తరలివెళ్తున్నారు. దీంతో లారీలో నుంచి రోడ్డు పై డస్ట్ ముద్దలు పడడడంతో, గాలిలో కలిసి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. దీనికి తోడు హైవే పక్కనే ఉండే ఇండ్లలోకి డస్టు వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు డస్ట్ లారీల పట్ల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జీపీ ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు తెలపాలి

పర్వతగిరి, సెప్టెంబరు 19 : జీపీ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో మండల పరి షత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శంకర్‌నాయక్ మాట్లాడుతూ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీలోపు సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రూపేష్, ఆయా పార్టీల మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : గ్రామ పంచాయతీలలో విడుదల చేసిన వార్డుల వారి ఓటరు జాబితాలపై అభ్యంతరాలు తెలపాలని ఎంపీడీవో అరుంధతి రాజకీయ నాయకులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ పార్టీల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఓటర్ల చేర్పులు మార్పులపై, సవరణలపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రైల బాబు, బొటికు సంజీవ, జక్కుల తిరుపతి, వెంకటయ్య, బుచ్చయ్య, అనిల్ పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల నోటీసు బోర్డులపై ఏర్పాటు చేసిన ఓటర్ లిస్ట్ డ్రాఫ్ట్ పై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నాయో ఈనెల 21 వరకు తెలపాలని కోరారు. ఇప్పటికే బొక్కలగూడెం, ఉప్పర పెల్లి, దివిటిపెల్లి, చెన్నారం, దమ్మన్నపేట, కొత్తపెల్లి, ల్యాబర్తి, రామోజీ కుమ్మరిగూడెం తండాల నుంచి 43 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. ఎక్కువగా కుటుంబ సభ్యుల ఓట్లు వివిధ వార్డుల్లోకి మారడం ఉందని వచ్చినట్లు వాటిని సరిచేస్తామన్నారు.

ఈ నెల 28న చివరి లిస్ట్ వస్తుందని, 26 న రిక్టిఫికేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి తూళ్ల కుమారస్వామి, ఎద్దు సత్యనారా యణ, రాయపురపు కుమారస్వామి, ఆరెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి : ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో కిషన్ నాయక్, ఎంపీవో కూచన ప్రకాష్‌లు మాట్లాడుతూ ఈనెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని ఓటర్ల జాబితాను వివిధ పార్టీల నాయకులు పరిశీలించి అభ్యంతరాలు తెలపాలని సూచించారు.